స్పందించలేదంతే..





కంచరపాలెంలోని అపార్టుమెంట్‌లో అవగాహన కల్పిస్తున్న క్రైం సీఐ శ్రీనివాసరావు (ఫైల్)



రోడ్డుపై బ్యానర్లతో అవగాహన కల్పిస్తున్న క్రైం పోలీసులు (ఫైల్)

మద్దిపాలెం : ఇప్పుడు ప్రజలంతా 5జీ సదుపాయం గల స్మార్ట్‌ఫోన్లు వాడుతున్నారు. పలు రకాల సేవలు అందుబాటులోకి వచ్చేశాయి. సినిమా, రైలు, బస్ తదితర టికెట్లు అరచేతిలోని ఫోన్ ద్వారానే బుక్ చేసుకోవడం తెలిసిందే. ఈ నేపథ్యంలో కొన్నేళ్ల క్రితం పోలీసు శాఖ ప్రవేశపెట్టి అమలు చేస్తున్న లాక్డ్ హౌస్ మోనిటరింగ్ సిస్టమ్ (ఎల్‌హెచ్‌ఎంఎస్)కి మాత్రం ప్రజల నుంచి ఆశించిన రీతిలో స్పందన లేకపోవడం గమనార్హం. ఈ విషయంలో ఎందుకనో ప్రజల్లో ఆశించిన రీతిలో ఇంకా చైతన్యం లేదనే చెప్పాలి. ఏటా సంక్రాంతి సీజన్‌లో అధిక సంఖ్యలో ప్రజలు కుటుంబ సమేతంగా ఇళ్లకు తాళాలు వేసేసి సొంత ఊర్లకు వెళ్తుంటారు. ముఖ్యంగా శ్రీకాకుళం, విజయనగరం, ఉభయ గోదావరి, కృష్ణా తదితర జిల్లాల ప్రజలు విశాఖలో ఎప్పటి నుంచో స్థిర నివాసం ఏర్పాటు చేసుకుని వృత్తులు, వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. వారంతా పండగొస్తే స్వస్థలాలకు వెళ్లిపోతారు. ఈ క్రమంలో ఇదే అదునుగా దొంగలు కూడా చెలరేగిపోవడంతో ఎక్కువగా దొంగతనాలు జరుగుతుంటాయి. ఆ దొంగతనాలకు అడ్డుకట్ట వేసేందుకు ఈ ఏడాది ఐదో పట్టణ క్రైం పోలీసులు ఎల్‌హెచ్‌ఎంఎస్‌పై విస్తృత ప్రచారం చేశారు. అయినప్పటికీ ఒక్కటంటే ఒక్క దరఖాస్తు కూడా రాకపోవడంతో పోలీసులు విస్తుబోతున్నారు.

కాలనీల్లో విస్తృతంగా పోలీసుల ప్రచారం...

ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో కంచరపాలెం, ఊర్వశి, బర్మాక్యాంప్, జ్ఞానాపురం, ఇందిరానగర్, కప్పరాడ, ఎన్జీజీవోస్ కాలనీ, మురళీనగర్, మద్రిపాలెం, కరాస, దయానందనగర్, తదితర ప్రాంతాల్లో మొత్తం ఫిఫ్త్‌టౌన్ పరిధిలో రెండు నుంచి మూడు లక్షల వరకు జనాభా నివసిస్తున్నారు. అధిక శాతం ప్రజలు ఇతర జిల్లాల నుంచి వలస వచ్చినవారే కావడంతో ఏటా సంక్రాంతి సీజన్‌లో సొంత ఊర్లకు వెళుతుంటారు. ఈ నేపథ్యంలో ఇళ్లకు తాళాలు వేసి ఉంటే దొంగలు ఏటా సంక్రాంతి సీజన్‌లో దొంగతనాలకు పాల్పడుతున్నారని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ క్రమంలో సీపీ ఆదేశాల మేరకు రాత్రి గస్తీ ముమ్మరం చేయడంతో ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో చోరీలు గణనీయంగా తగ్గుముఖం పట్టాయనే చెప్పుకోవాలి. అయినప్పటికీ పూర్తిస్థాయిలో దొంగతనాలు నియంత్రించాలనే ఉద్దేశంతో స్టేషన్ పరిధిలో గల ముఖ్యమైన జంక్షన్లు, అపార్ట్‌మెంట్లు, షాపింగ్ కాంప్లెక్సులలో ఐదో పట్టణ క్రైం పోలీసులు విస్తృతంగా అవగాహన సమావేశాలు ఏర్పాటు చేసి ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్ డౌన్‌లోడు కూడా చేయించారు. స్వస్థలాలకు వెళ్లే ముందు ప్రజలు విధిగా ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌ని మొబైల్ ఫోన్‌లో రిక్వెస్ట్ పంపిస్తే పోలీసులు ఉచితంగా ఇళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తారని క్రైం పోలీసులు ప్రచారం నిర్వహించారు. ఏటా సంక్రాంతి, వేసవి సెలవుల ముందుగా ఈ ప్రచారం చేస్తూనే వున్నారు. కానీ ప్రజల నుంచి మాత్రం ఈ ఏడాది కూడా సరైన స్పందన లేకపోవడం పోలీసులకు సవాల్‌గా మారిందనే చెప్పుకోవాలి.

ఒక్క దరఖాస్తూ రాలేదు



ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌పై విస్తృతంగా ప్రచారం చేశాం. అపార్ట్‌మెంట్లు, ముఖ్యమైన జంక్షన్లలో ఈ యాప్‌పై ప్రజలకు అవగాహన కల్పించి, మొబైల్ ఫోన్లలో డౌన్‌లోడు చేయిస్తున్నాం. ఏటా సంక్రాంతి, వేసవి సెలవుల సీజన్లలో విస్తృతంగా సమావేశాలు నిర్వహిస్తున్నాం. స్టేషన్ పరిధిలో సీసీ కెమెరాలు అందుబాటులో ఉన్నా సరే ఒక్క రిక్వెస్ట్ కూడా రాలేదు. ఈ విషయంలో ప్రజల్లో ఇంకా చైతన్యం పెరగాల్సిన అవసరం ఉంది. –ఎస్.శ్రీనివాసరావు, క్రైం సీఐ

యాప్‌తో ఉపయోగాలెన్నో...

ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్ నుంచి రిక్వెస్ట్ పంపించిన తర్వాత సంబంధిత స్టేషన్ పోలీసులు ఇంటికి వచ్చి ఉచితంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తారు. దీంతో ఇంట్లో ఎవరైనా దొంగలు ప్రవేశించిన వెంటనే స్టేషన్‌లో సిబ్బంది అలెర్ట్ అయ్యి సదరు ఇంటికి సమీపంలో గస్తీలో ఉన్న పోలీసులకు క్షణాల్లో సమాచారం చేరవేస్తారు. దీంతో పోలీసులు వెంటనే దొంగలను అరెస్టు చేయడానికి మార్గం సుగమం అవుతుందని పోలీసు ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఈ మేరకు అవగాహన సమావేశాలు ఏర్పాటు చేసి ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్ విస్తృతంగా డౌన్‌లోడు కూడా చేయిస్తున్నారు. కానీ ఈ ఏడాది ఐదో పట్టణ క్రైం పోలీసులకు ఒక్క రిక్వెస్ట్ కూడా రాకపోవడం విచారకరం. చోరీ జరిగిన తర్వాత బాధపడేకంటే ముందు జాగ్రత్త చర్యగా ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్ సాయం తీసుకోవాలని పోలీసులు పదేపదే కోరుతున్నారు.

నేటి నుంచి త్యాగరాజ ఆరాధనోత్సవాలు

మద్దిలపాలెం : త్యాగరాజ ఆరాధన ట్రస్ట్ ఆధ్వర్యంలో త్యాగరాజ ఆరాధన ఉత్సవాలు ఈ నెల 17 నుంచి 23 వరకూ మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో నిర్వహిస్తున్నామని ఆరాధాన ట్రస్ట్ ప్రతినిధులు ఎంఎస్ఎన్ రాజు, డాక్టర్ గుమ్ములూరి రాంబాబు తెలిపారు. ఈ ఏడాది ఏడు రోజులపాటు ఉత్సవాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశామన్నారు. తొలి రోజు 17న తమిళనాడు సంగీత, లలిత కళల విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి, ప్రముఖ వీణ విద్వాన్సురాలు వీణా ఈ.గాయత్రి ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. ఏటా ఇచ్చే ప్రతిష్టాత్మక సంగీత కళాభారతి అవార్డును ప్రముఖ నాదస్వర విద్యాంసుడు గురువిల్ల అప్పన్నకు అందిస్తున్నామని తెలిపారు. అవార్డుతో పాటు, పట్టు వస్త్రాలు, ప్రశంసాపత్రం, రూ.10వేలు నగదు పురస్కారం అందిస్తామన్నారు. అనంతరం సంగీత కార్యక్రమంలో హంస అకాడమీ అధ్యాపకులు, విద్యార్థులు త్యాగరాజ కీర్తనలతో కూర్చిన ×సంగీత సాహిత్య సద్భక్తి సమన్వయ్ణ కార్యక్రమం నిర్వహిస్తారని తెలిపారు. రెండో రోజు 18న ఉదయం 7 గంటలకు స్థానిక త్యాగరాజ ఆలయంలో విశేష పూజలు నిర్వహించిన తర్వాత శ్రీ సీతారామ పరివారాన్ని ఊరేగింపుగా కళాభారతి చూట్టూ, వందలాది కళాకారులు గానం చేస్తుండగా కోలాటం, నాదశ్వర వాయిద్యాలతో, కార్యదర్శి డాక్టర్.గుమ్ములూరి రాంబాబు త్యాగరాజ వేషధారణలో భారీ ఊరేగింపు నిర్వహిస్తామన్నారు.

అనంతరం 200 మంది పైగా సంగీత విద్వాంసులు ఘనరాగ పంచరత్న కీర్తనలు ఆలపిస్తారని తెలిపారు. అనంతరం మంగళ ధ్వని – నాదస్వర వాద్యం గురువిల్లి అప్పన్న బృందం కచేరీ ప్రారంభమవుతుందని తెలిపారు. వారం రోజులపాటు జరిగే కచేరిలో పాల్గొనేందుకు 1169 దరఖాస్తులు రాగా వాటిలో 1110 అంగీకరించామన్నారు. ఏడు రోజుల పాటు 404 సంగీత కచేరీలు నిర్వహించనున్నామన్నారు. చెన్నై, బెంగళూరు, అహ్మదాబాద్, హైదరాబాద్, విజయవాడ, గుంటూరు నుంచి కళాకారులు తరలివస్తున్నారని తెలిపారు. మధ్యాహ్నం అన్నప్రసాదం ఏర్పాటు చేస్తామని తెలిపారు.

క్లుప్తంగా

లలితాపీఠంలో ప్రత్యేక పూజలు

సీతంపేట : సంకట హర చతుర్థి సందర్భంగా శుక్రవారం సాయంత్రం 5 గంటలకు శ్రీలలితా పీఠంలో విజయగణపతికి పంచామృత అభిషేకం, హరిద్ర గణపతి హోమం నిర్వహిస్తామని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. అలాగే శనివారం సాయంత్రం 6:45 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామ పారాయణ, శుద్ధ షష్ఠి సందర్భంగా ఆదివారం వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామికి విశేష అభిషేకం, హోమం నిర్వహిస్తామని తెలిపారు. అష్టమి సందర్భంగా మంగళవారం సాయంత్రం 7 గంటలకు కాలభైరవ హోమం, అలాగే 22న ఉదయం 9:30 గంటలకు చండీహోమం జరుగుతుందని తెలిపారు. కుర్తాళం, సిద్ధేశ్వరీ పీఠం, శ్రీలలితాపీఠం ఉత్తరాధికారి దత్తేశ్వరానంద భారతీ స్వామి దర్శనం రోజూ ఉదయం 11 గంటల నుంచి 11.30 వరకు కల్పిస్తామని తెలిపారు.

19న వేమన జయంతి

సీతమ్మధార : వేమన జయంతి వేడుకలు ఈ నెల 19న నిర్వహిస్తామని వేమన సంక్షేమ సంఘం అధ్యక్షుడు గౌరుసు మహేశ్వరరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్‌కే బీచ్ రోడ్డులోని కాళీమాత దేవాలయం సమీపంలో 19న ఉదయం 9 గంటల నుంచి వేమన జయంతి వేడుకలు జరుగుతాయన్నారు. ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, గురుమూర్తి రెడ్డి, ఇతర ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు. నగర ప్రజలు వేమన జయంతి వేడుకల్లో పాల్గొనాలని ఆయన కోరారు. అదేరోజున ఉదయం ఆశీలమెట్టలోని వేమనమందిరం ఆవరణలో గల వేమన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పిస్తామని తెలిపారు.

సిరులతల్లికి పంచామృతాభిషేకం



పంచామృతాభిషేక సేవలో కనకమహాలక్ష్మి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అన్నార్తులకు అల్పాహారం పంపిణీ



అల్పాహారం అందిస్తున్న పైల దివాకర్

మద్రిపాలెం : కుమారుడు పైల శివతేజ 11వ వర్ధంతి సందర్భంగా శివతేజ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పైల దివాకర్ గురువారం రైల్వే న్యూకాలనీలో ఉన్న సాయిబాబా ఆలయంలో అన్నార్తులకు అల్పాహారం అందజేశారు. చిరంజీవి, సత్య మహారాణా, నమ్మి శ్రీనివాస్, మోక్షజ్ఞ పాల్గొన్నారు.

భారీ స్పీడ్‌బ్రేకర్‌తో ప్రమాదాలు



నక్కవానిపాలెంలో ప్రమాదకరంగా మారిన స్పీడ్ బ్రేకర్

సీతమ్మధార : జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెం ప్రాంతంలో కొత్తగా ఏర్పాటు చేసిన స్పీడ్‌బ్రేకర్ కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇక్కడి ఏఎంజీ ఆస్పత్రి సమీపంలో ఇటీవల జీవీఎంసీ జోన్ – 3 ఇంజినీర్లు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు. అంతవరకు బాగానే వుంది. కానీ, ఈ స్పీడ్ బ్రేకర్ వెడల్పు బాగా ఎక్కువగా వుండడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. మరోవైపు స్పీడ్ బ్రేకర్ మీద రేడియం కలర్స్ లేకపోవడంతో రాత్రి పూట సక్రమంగా కనిపించడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొత్తగా వచ్చే వాహనచోదకులు స్పీ డ్‌బ్రేకర్‌ని గమనించలేక అవస్థలు పడుతున్నారు. వెడల్పు, ఎత్తు ఎక్కువగా ఉండడంతో ఈ స్పీడ్‌బ్రేకర్ వద్ద పగలు, రాత్రి తేడా లేకుండా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికే 20కి పైగా ప్రమాదాలు జరిగాయని స్థానిక ప్రజలు చెబుతున్నారు. ఫలితంగా పలువురు వాహనచోదకులు గాయాలపాలవుతున్నారని ఆందోళన చెందుతున్నారు. స్పీడ్‌బ్రేకర్లు కనిపించేలా రేడియం కలర్స్ వాడకపోవవం దారుణమని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఇక్కడికి సమీపంలో వాహనాలు మరమ్మతులు చేసే దుకాణాల కారణంగా ఈ మార్గంలో తరచూ ట్రాఫిక్ జామ్ అవుతోందని స్థానికులు వాపోతున్నారు. తహసీల్దార్ ఆఫీసు, కేఆర్‌ఎం కాలనీ ప్రాంతాలకు ఈ మార్గం ద్వారానే ప్రజలు రాకపోకలు సాగిస్తారు. ఇప్పటికైనా జీవీఎంసీ జోన్ – 3 పబ్లిక్ వర్క్స్ విభాగం ఇంజినీర్లు స్పందించి స్పీడ్‌బ్రేకర్‌కి రంగులు ఏర్పాటు చేయాలని, వెడల్పు తగ్గించాలని స్థానిక ప్రజలు, వాహన చోదకులు కోరుతున్నారు.

పేరుకుపోయిన చెత్త



బీటీఆర్‌నగర్ రోడ్‌లో పేరుకుపోయిన చెత్త

సీతంపేట : జీవీఎంసీ 25వ వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. సంక్రాంతి కారణంగా వరుస సెలవులతో వార్డులో పలుచోట్ల చెత్త పేరుకుపోయింది. గురువారం నుంచి సిబ్బంది విధులకు హాజరు కావాల్సి ఉంది. అయినా పలు ప్రాంతాల్లో చెత్త, వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. స్థానిక రెల్లి వీధి ఎదురుగా, శాంతిపురంలో క్రౌన్ బేకరీ సమీపంలో చెత్త పేరుకుపోయింది. పేరుకుపోయిన చెత్త గాలికి, కుక్కల వల్ల చెల్లాచెదురు కావడంతో పరిసరాలు అధ్వానంగా మారుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి వార్డులో పారిశుధ్యం మెరుగు కోసం తగు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

అసాంఘిక కార్యకలాపాల అడ్డా

- ధారకొండలో కానరాని పోలీసుల నిఘా



అసాంఘిక శక్తుల నిలయంగా మారిన ధారకొండ ప్రాంతం

సీతమ్మధార : జీవీఎంసీ 14వ వార్డులో గల ధారకొండ ప్రాంతం అసాంఘిక కార్యకలాపాల అడ్డాగా మారుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఇక్కడ గతంలో యువకులు గంజాయితో అరెస్ట్ అయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సంక్రాంతి పండగ సీజన్ కావడంతో అసాంఘిక శక్తులు పెద్ద ఎత్తున ఇక్కడ మకాం వేసినా సరే నాలుగో పట్టణ పోలీసుల నిఘా శూన్యం కావడంతో స్థానిక ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇక్కడ మద్యపానం, గంజాయి, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలు జోరుగా సాగుతున్నాయని స్థానిక ప్రజలు వాపోతున్నారు. సంక్రాంతి కావడంతో గత మూడు రోజులుగా ఇక్కడ పెద్ద సంఖ్యలో ద్విచక్ర వాహనాల మీద వస్తున్న యువకులు మద్యపానం, గంజాయి సేవనం, పేకాటలో మునిగిపోతున్నా పోలీసుల దాడులు మచ్చుకైనా కానరావడం లేదని స్థానికులు గగ్గోలు పెడుతున్నారు. ఇక్కడకు సమీపంలోనే రాధాకృష్ణ లే అవుట్, బాలయ్యశాస్త్రి లే అవుట్, నార్త్ ఎక్స్‌టెన్సన్ ప్రాంతాలున్నాయి. ఇక్కడ పలువురు వీవీపీలు కూడా నివసిస్తున్నారు. అయినా పోలీసుల నిఘా కొరవడడం పట్ల సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సాధారణంగా రోజూ రాత్రిపూట అసాంఘిక శక్తులన్నీ ఇక్కడ ఒకచోట చేరడం ఆనవాయితీగా మారిపోయింది. ఇక సంక్రాంతి పండగ సీజన్ కావడంతో వీరికి ధారకొండ వరంగా మారిందనే చెప్పాలి. చుట్టుపక్కల ప్రజల ఇబ్బందులు ఎవరికీ పట్టకపోవడం తీవ్ర దుమారం రేపుతోంది. నాలుగో పట్టణ పోలీసులు నిఘా పెంచి అసాంఘిక శక్తులను అదుపు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

అందరి భాగస్వామ్యంతో తాబేళ్ల సంరక్షణ



వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట: సముద్ర తాబేళ్ల పరిరక్షణకు అందరి సహకారం అవసరమని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అన్నారు. సముద్ర తాబేళ్ల సంరక్షణకు తీసుకోవలసిన చర్యలు, సుస్థిర చేపల వేట విధానంపై కలెక్టర్ గురువారం సమీక్షించారు. పలు శాఖల అధికారులు, శాస్త్ర వేత్తలు, ఫిషింగ్ బోట్ యజమానుల సంఘం ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఆడ తాబేళ్లు నవంబర్, ఫిబ్రవరి మధ్యలో తీరానికి వచ్చి గుడ్లు పెడతాయన్నారు. ఇటీవల సముద్ర తాబేళ్ల మృత కళేబరాలు తీరానికి చేరడం గమనిస్తున్నామని, అవి చేపల వేట సమయంలో వలల్లోను, సముద్రంలో విడిచిపెట్టే తెగిపోయిన వలలు, ప్లాస్టిక్ వ్యర్థాల్లో చిక్కుకుని మరణిస్తున్నాయని మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ పి.లక్ష్మణరావు తెలిపారు. ఇలాంటి పరిణామాల వల్ల భవిష్యత్తులో ఆలీవ్ రిడ్లే రకపు తాబేళ్లు అంతరించిపోయే ప్రమాదం ఉందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని తాబేళ్లు తప్పించుకునే అవకాశం ఉన్న టీఈడీ పరికరాన్ని వినియోగించాలన్నారు. వన్య మృగ సంరక్షణ చట్టం – 1972 ప్రకారం తాబేళ్లను చంపడం, తినడం, అమ్మడం, రవాణా చేయడం నిషేధం అన్నారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ జిల్లా అధికారి శ్రీవాణి, మత్స్యశాఖ సంయుక్త సంచాలకులు పి.లక్ష్మణరావు, కేంద్ర మత్స్య సంస్థల ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ శ్రీధర్, డాక్టర్ జోయ్ కిజాకుద్దీన్, ఫిషరీ సర్వే ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఐ) జోనల్ డైరెక్టర్ భామిరెడ్డి, శాస్త్రవేత్త ప్రసాద్, ఎంపెడా డిప్యూటీ డైరెక్టర్ ప్రసాద్ నాయక్, మెరైన్ సీఐ దివాకర్, మత్స్యశాఖ ఏడీ విజయ కృష్ణ, పోలీసు అధికారులు, నెట్ ఫిష్ స్టేట్ కో–ఆర్డినేటర్ హన్మంతరావు, మత్స్యశాఖ అభివృద్ధి అధికారి ఆషాజ్యోతి, డాల్ఫిన్ మెకనైజ్డ్ బోటు యజమానుల సంఘ అధ్యక్షుడు వీర్రాజు, సంప్రదాయ బోట్ల ప్రతినిధి జి.యల్లయ్య (కింగ్) తదితరులు పాల్గొన్నారు.

వీధిలైట్లకు పండగ సెలవులు..!

- తూర్పు, ఉత్తర నియోజకవర్గాల్లోని పలు కాలనీల్లో అంధకారం
- పట్టించుకోని జోన్ – 3 ఇంజినీర్లు



పాపాహోం రోడ్డులో వెలగని వీధిలైటు



బాలయ్య శాస్త్రి లే అవుట్ వద్ద వెలగని వీధిలైటు



అభయాంజనేయ స్వామి ఆలయం రోడ్డులో వెలగని లైట్లు

సీతమ్మధార : జీవీఎంసీ పరిధిలో ఏ ముహూర్తాన వీధిలైట్ల కాంట్రాక్ట్‌ని బీ అండ్ ఆర్ సంస్థకు అప్పగించారో అప్పటి నుంచి లైట్లు పూర్తి స్థాయిలో వెలగడం లేదని ప్రజలు సర్వత్రా ఆందోళన వ్యక్తం చేస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. విశాఖ ఉత్తర, తూర్పు నియోజకవర్గాల పరిధిలో వీధిలైట్ల వ్యవస్థ అధ్వానంగా తయారైందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. సంక్రాంతి సెలవులు ఉద్యోగులకే కాదు వీధిలైట్లుకి కూడా ఇచ్చారా అని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. జోన్ – 3 పరిధిలో సుమారు 8 వేల వరకు వీధి లైట్లు ఉన్నాయి. ఇందులో 20 శాతం వరకు లైట్లు వెలగడం లేదని అంచనా. అంటే కాంట్రాక్టర్ మీద జీవీఎంసీ ఇంజినీర్ల పర్యవేక్షణ ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

నిర్లక్ష్యం వల్లే వీధుల్లో చీకటి

సచివాలయం ఎమినిటీస్ కార్యదర్శులంతా విధిగా రోజూ రాత్రిపూట వీధుల్లో తిరిగి వెలగని వీధిలైట్ల నంబర్లు నోట్ చేసుకుని కాంట్రాక్టర్ ద్వారా మరమ్మతులు చేయాలని ఆదేశించినా ఆచరణలో సాధ్యంకాని పనిగా తేలిపోయిందంటే అతిశయోక్తి కాదు. అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా ఉత్తర నియోజకవర్గంలోని పలు ప్రాంతాలు చీకట్లో మగ్గిపోతున్నాయంటే అతిశయోక్తి కాదు. సీతమ్మధార, ఎంఎంటీసీ కాలనీ, సత్యం జంక్షన్, గాంధీనగర్, క్రాంతినగర్, నక్కవానిపాలెం, రేసపువానిపాలెం, బాలయ్యశాస్త్రి లే అవుట్, అభయాంజనేయ స్వామి కోవెల, పాపాహోమ్ రోడ్డు, రాధాకృష్ణ లే అవుట్, టీపీటీ కాలనీ, పీ అండ్ టీ కాలనీ తదితర ప్రాంతాల్లో లైట్లు సక్రమంగా వెలగడం లేదని ప్రజలు వాపోతున్నారు. కొన్ని ప్రాంతాల్లో పగలు కూడా నిక్షేపంగా లైట్లు వెలగడం విశేషం. జీవీఎంసీ 14వ వార్డు సీతమ్మధార ఎస్ఎఫ్ఎస్ పాఠశాల పరిసర ప్రాంతాల్లో వీధిలైట్లు వెలగక రాత్రిపూట అంధకారం నెలకొంటుందని ప్రజలు విచారం వ్యక్తం చేస్తున్నారు. రాత్రిపూట డ్యూటీ నుంచి ఇంటికెళ్లే ఉద్యోగులు పడరాని పాట్లు పడుతున్నారు. ఇక్కడి మోడ్రన్ లైట్లు వెలగడం లేదు. ఒక పోల్‌కి రెండు లైట్లు వుంటే ఒకటి వెలగడం లేదు. అలాగే, మోడ్రన్ విద్యుత్ పోల్‌కి రెండు లైట్లు వుంటే ఒక లైటు కనిపించడం లేదు. ఇంకా వీధిలైట్లకు చెట్ల కొమ్మలు అడ్డం ఉండడంతో అంధకారం నెలకొంటుందని ఆందోళన వ్యక్తమవుతోంది. ఒకవైపు అంధకారం, మరోవైపు కుక్కల బెడద కారణంగా రాత్రిపూట పాదచారులు, వాహనచోదకులు పడరానిపాట్లు పడుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు.

ఫిర్యాదులు చేయలేని పరిస్థితి

కూటమి ప్రభుత్వం వచ్చాక వార్డు వలంటీర్ వాట్సప్ గ్రూపులు లేకపోవడం, సచివాలయం ఎమినిటీస్ కార్యదర్శుల మొబైల్ నెంబర్లు అందుబాటులో లేని కారణంగా ఫిర్యాదులు చేయడానికి ప్రజలు అగచాట్లు పడాల్సి వస్తోంది. ఇక పలు ప్రాంతాల్లో పగలు కూడా వీధి లైట్లు నిక్షేపంగా వెలుగుతూ విద్యుత్ వృథా అవుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. కాంట్రాక్ట్ సిబ్బంది సకాలంలో ఫిర్యాదులు పరిష్కరించకపోవడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. చీకట్లో కుక్కల బెడద కూడా ఉంది. ఇప్పటికైనా జీవీఎంసీ పబ్లిక్‌వర్క్స్ ఇంజినీర్లు స్పందించి జోన్ – 3 పరిధిలో గల తూర్పు, ఉత్తర నియోజకవర్గంలో పూర్తి స్థాయిలో వెలగని వీధిలైట్లకు మరమ్మతులు నిర్వహించాలని, మాయమైన లైట్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

2030 నాటికి బిలియన్ డాలర్ల పసుపు ఎగుమతే లక్ష్యం

బీచ్‌రోడ్డు : భారత పసుపు ఎగుమతులు 2030 నాటికి ఒక బిలియన్ డాలర్లకు చేరుకోవాలనేది లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఇండియన్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఇన్ ఇంటర్నేషనల్ ఎకనామిక్ రిలేషన్స్ డైరెక్టర్ దీపక్ మిశ్రా అన్నారు. నగరంలోని ఒక హోటల్‌లో ఆమ్వే ఇండియా అధ్వర్యంలో పసుపు రైతులు ఎదుర్కొంటున్న సవాళ్లపై గురువారం సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ 2020 నాటికి పసుపు గ్లోబల్ మార్కెట్ 58.2 మిలియన్ల డాలర్లు ఉందని... ఈ మార్కెట్ 2028 నాటికి 16.1 శాతం వృద్ధి సాధిస్తుందని వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ అంచనా వేసిందన్నారు. ఈ లక్ష్యానికి మద్దతుగా ప్రభుత్వం జాతీయ పసుపు మండలి ఏర్పాటు చేసిందన్నారు. ప్రపంచ పసుపు మార్కెట్‌లో భారతదేశ స్థానాన్ని పెంపొందించడానికి వ్యూహాత్మక ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆమ్వే ఇండియా ఎండీ రాజనీష్, డాక్టర్ అర్పిత తదితరులు పాల్గొన్నారు.

సురక్షితంగా గమ్యం చేర్చడమే లక్ష్యం



రోడ్డు భద్రతపై వివరిస్తున్న డీటీసీవో అప్పలనాయుడు

మద్దిలపాలెం : ప్రయాణికులను సురక్షితంగా గమ్య స్థానాలకు చేర్చడంలో ప్రజా రవాణా శాఖ డ్రైవర్లది కీలక బాధ్యత అని జిల్లా ప్రజా రవాణా అధికారి అప్పలనాయుడు అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా మద్దిలపాలెం డిపోలో గురువారం ఆయన డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రయాణంలో డ్రైవర్లు ఎంతో అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, పాదచారుల కదలికలను గమనిస్తూ అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ అరుణకుమారి, ఎ.మణికుమారి, హిమబిందు, తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహానికి యువకుడి తరలింపు



ఆర్‌పీఎఫ్ పోలీసులతో భూషణ్‌కుమార్

సీతమ్మధార: బీహార్‌లోని పుల్లట్ల తాలూకా సీతమరి గ్రామానికి చెందిన భూషణ్ కుమార్ (20) తమిళనాడులోని సేలం నుండి బీహార్ వెళ్లే రైల్లో ప్రయాణిస్తూ విశాఖ రైల్వేస్టేషన్‌లో దిగిపోయాడు. అతను అనుమానాస్పదంగా తిరుగుతుండగా ఆర్‌పీఎఫ్ సిబ్బంది గమనించారు. అతని మానసిక స్థితి సరిగా లేదని గ్రహించి ఏయూటీడీ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. దీంతో ఏయూటీడీ సిబ్బంది ఆ యువకుడికి నిరాశ్రయుల వసతిగృహంలో ఆశ్రయం కల్పించి యువకుడి కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడి సమాచారం అందించారు. వారు మూడు రోజుల్లో వచ్చి యువకుడిని తీసుకెళ్తామని చెప్పారని ఏయూటీడీ సిబ్బంది తెలిపారు.